క్లుప్తంగా

పెన్షనర్లకు డీఏ ఇవ్వాలి

నల్లగొండ టౌన్: పెన్షనర్లకు డీఏ వెంటనే ఇవ్వాలని పెన్షనర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దసరా నుంచి దీపావళి పండుగ వరకు ఎదురుచూస్తున్నా ఇప్పటివరకు డీఏ విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు దాతల చేయూత


ఐప్యాడ్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ: ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని కౌశితకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని లయన్స్ భవన్‌లో రూ.50 వేల విలువ చేసే ఐ ప్యాడ్‌ను పీఎంజేఎఫ్ లయన్ కేవీ ప్రసాద్, కోడె సతీష్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మిర్యాల యాదగిరి, విష్ణు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం..


నగదు అందజేస్తున్న అల్వాల్‌రెడ్డి

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన డెంకాల జానయ్య కుమారుడు ఈశ్వర్‌సాయి ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కాగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడనే విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాల అల్వాల్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని ఈశ్వర్‌సాయికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

కనగల్ : గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కనగల్‌లో నిర్వహించిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలే సాంబయ్య, సీహెచ్ లక్ష్మీనారాయణ, కానుగు లింగస్వామి, ఏర్పుల యాదయ్య, పోలే సత్యనారాయణ, పి.వినోద్‌కుమార్, వరికుప్పల ముత్యాలు, పొన్న అంజయ్య, పి.సర్వయ్య, ఎండీ జహీర్, జానయ్య, రామలింగయ్య, ఐరిగి ఎల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాస కల్యాణం


శివాలయంలో మాస కల్యాణ వేడుకలు

నకిరేకల్ : పట్టణంలోని శివాలయంలో ఆదివారం స్వామివారి 132వ మాస కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు జిగురు లక్ష్మీనర్సింహమూర్తి, నారాయణశర్మ, శివనారాయణశర్మ, వెంకన్న శర్మ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, కొండ తిరుమలేష్‌గౌడ్, సరిత, పులుసు ప్రవల్లిక, ప్రదీప్‌గౌడ్, ఆలయ మాజీ చైర్మన్ కొండ జానయ్యగౌడ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


వైష్ణవి

మునుగోడు: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మునుగోడులోని జ్యోతిరావుపూలే బాలిక పాఠశాల విద్యార్థిని వై.వైష్ణవి ఎంపికై ంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో మూడు రోజులు జరిగిన స్కూల్‌గేమ్స్ స్థాయి పోటీల్లో వి.వైష్ణవి నల్లగొండ జిల్లా టీమ్ తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచిందని ఆదివారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు.

బెంచీలు వితరణ


సిమెంట్ బెంచీలు అందిస్తున్న దాతలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కు ఎన్ఆర్‌ఐ గోర్స్ ఫౌండేషన్ యూఎస్‌ఏ ఆధ్వర్యంలో సరంపేటతండాకు చెందిన రమావత్ కృష్ణనాయక్ ఆదివారం రూ.50వేల విలువగల పది సిమెంట్ బెంచీలను అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు రాకేష్ రమావత్ లాల్‌సింగ్ నాయక్, రమావత్ విజయకుమార్, శ్రీను నాయక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను వేధిస్తున్న కూలీల కొరత

- మునుగోడులో దాదాపు 38 వేల ఎకరాల్లో పత్తి సాగు
- స్థానికంగా దొరకని కూలీలు
- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు


గూడపూర్ గ్రామ శివారులో కూలీల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడిసెలు


మునుగోడులో ఓ రైతు చేనుపైనే వదిలేసిన పత్తి

మునుగోడు: కొండంత ఆశతో పంటలు సాగుచేస్తున్న రైతులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని విత్తనాలు నాటి పంట దిగుబడి వచ్చేలా శ్రమించడం ఒక ఎత్తయితే, ఆ దిగుబడిని చేతికి తీసుకోవడం మరొక ఎత్తుగా మారింది. పత్తి పంట సాగు చేసిన ప్రతి రైతుకు ఒకే సమయంలో కూలీలు అవసరం ఉండడంతో కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొందరు రైతులు కూలీల కోసం తిప్పలు పడలేక కనీసం ఒకమారు కూడా పత్తి ఏరించలేక చేనుపైనే వదిలేస్తున్నారు.

రైతులకు అదనపు ఖర్చు..

మునుగోడు మండలంలోని 28 గ్రామాల్లో దాదాపు 20వేల మంది రైతులు తమ భూముల్లో అధికంగా పత్తి పంట సాగు చేశారు. మండలవ్యాప్తంగా 54 వేల ఎకరాల సాగు భూమి ఉండగా అందులో పత్తి పంటను దాదాపు 38 వేల ఎకరాల్లో సాగుచేశారు. అయితే ఆ చేలన్నీ ఒకేసారి దిగుబడి రావడంతో పత్తి తీసేందుకు అవసరమైన కూలీలు స్థానికంగా దొరకడం లేదు. దీంతో కూలీలను ఏపీ రాష్ట్రంతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తీసుకొచ్చి వారికి ఉండేందుకు నివాసం ఏర్పాటుచేసి పత్తి తీయించుకుంటున్నారు. దీంతో కూలీ డబ్బులతోపాటు కూలీలకు సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. మరి కొంతమంది రైతులు నల్లగొండ, నార్కట్‌పల్లి, నకిరేకల్ తదితర ప్రదేశాల నుంచి ఆటోల్లో కూలీలను తీసుకొని వచ్చి పత్తిని ఏరించుకుంటున్నారు. అందుకు కూలీ డబ్బులతోపాటు ఆటో చార్జీలు అధికమవుతున్నాయి. దీంతో వచ్చిన దిగుబడిలో సగం డబ్బులు కూలీలకే చెల్లించాల్సి వస్తోందని, మిగిలిన డబ్బులు పెట్టుబడి పోతే కనీసం తమకు కూలీ కూడా మిగలడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా షెడ్డు వేయించా



ఈ ఏడాది వర్షాలు అడపాదడపా కురవడంతో పత్తి దిగుబడి నామమాత్రంగా వచ్చింది. పత్తి ఏరేందుకు స్థానికంగా కూలీలు దొరకక పోవడంతో ఆంధ్ర రాష్ట్రం నుంచి కూలీలను తీసుకొచ్చాం. వారు ఉండేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేకంగా షెడ్డు ఏర్పాటు చేశా. అంతే కాకుండా ఇతర సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసి 15 ఎకరాల భూమిలో పత్తి తీయించుకుంటున్నా.

-కృష్ణయ్య, రైతు, మునుగోడు

రైతులే సౌకర్యాలు కల్పించారు



పత్తి కూలీ పనికోసం కుటుంబ సభ్యులతో కలిసి పది రోజుల క్రితం ఏపీ నుంచి ఇక్కడికి వచ్చాం. మేము ఉండేందుకు వసతితోపాటు ఇతర సౌకర్యాలు ఇక్కడి రైతులే కల్పించారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనిచేస్తే రోజుకు రూ.800 నుంచి రూ.వేయి వరకు ఇస్తున్నారు. రెండు నెలలు మాకు చేతినిండా పని దొరుకుతుంది.

-పత్రు, వలస కూలీ కర్నూలు జిల్లా

పేదలకు విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న కోమటిరెడ్డి లక్ష్మి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ : పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పనిచేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.50 కోట్ల తన సొంత నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, ఇతర అభివృద్ధి పనులను ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో ఉన్న 18 రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో తండ్రులను కోల్పోయిన ఎంతో మంది పిల్లలకు పోస్టాఫీసుల్లో రూ.లక్ష డిపాజిట్ చేస్తూ వారిని ఆదుకుంటున్నామని తెలిపారు. పది వేల మంది పేదలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 1500 మందికి ఆపరేషన్లు చేయించామన్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వం వేతనాలు పెంచే వరకు ఫౌండేషన్ ద్వారా ప్రతి నెలా వారి అకౌంట్‌లలో రూ.5వేల చొప్పున 14 మందికి రూ.70వేలు అందిస్తానన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీసీసీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంఈఓ శ్రీనివాస్, ఎస్‌ఓ జ్యోతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మేతరి యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కేజీబీవీ విద్యార్థినులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ లక్ష్మి

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


ఉచిత మీల్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, రేపాల మదన్‌మోహన్

నకిరేకల్ : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మీల్స్ ఆన్ వీల్స్, నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్ మండలాల లయన్స్ క్లబ్ వాహనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత మీల్స్ వాహనంతో నకిరేకల్ ప్రాంతంలోని పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. పట్టణంలో లయన్స్ భవన్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం క్లబ్ ప్రతినిధి పోతులు రాముల జ్ఞాపకార్థం ఆయన సతీమణి లింగమ్మ, కుమారులు కోడళ్లు పోతులు గిరిప్రసాద్, నవత, శ్యాంప్రసాద్, స్వరూప 400 మందికి అన్నదానం చేశారు. నకిరేకల్ క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్, డాక్టర్ వై.మోహన్‌రెడ్డి, రీజియన్ చైర్మన్‌లు కొండ సంతోష్, గుడుపూరి వెంకటేశ్వరరావు, జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాస్‌లు, సెంటినియల్, నవ్య క్లబ్‌ల అధ్యక్షులు కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ఎస్.రమాదేవి, వృద్ధాశ్రమం ట్రస్ట్ చైర్మన్ ఎన్.రాంమోహన్‌రావు, డీసీలు ఎర్ర శంభులింగారెడ్డి, శేఖర్‌షెట్టి, డెంకల సత్యనారాయణ, శాలిగౌరారం, కట్టంగూర్ క్లబ్‌ల అధ్యక్షులు గుజలాల్ శేఖర్‌బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

నల్లగొండ: పాత బస్తాల వ్యాపారానికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య తగాదా మొదలై దాడులు చేసుకున్న నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అన్నదమ్ములు నల్లగొండ పట్టణంలోని శివాజినగర్‌లో పక్కపక్క షాపులు ఏర్పాటు చేసుకుని పాత బస్తాలు కుట్టే వ్యాపారం చేస్తున్నారు. ఆదివారం ఒక వ్యక్తి బస్తాలు కొనేందుకు అన్న శ్రీనివాస్ షాపునకు వెళ్లి బస్తాలు కొనేందుకు చూడగా.. నచ్చకపోవడంతో పక్కనే ఉన్న తమ్ముడు సత్తిబాబు షాపులో బస్తాలు కొన్నాడు. ఆ సమయంలో సత్తిబాబు కూతురు రేణుక దుర్గ, వర్కర్ ఉన్నారు. ఈ క్రమంలో తన కొచ్చే గిరాకిని నువ్వు ఎలా తీసుకుంటావంటూ శ్రీనివాస్ తన తమ్ముడి దుకాణంలో పనిచేసే వర్కర్‌తో గొడవ పడ్డారు. తమ్ముడి కూతురు రేణుక దుర్గ అడ్డుకోగా ఆమెను నెట్టివేశాడు. తమ్ముడి భార్య అయిన భార్గవి అక్కడికి రావడంతో బావ శ్రీనివాస్ ఆమెను కూడా నెట్టివేయడంతో తలకు గాయమైంది. ఈ విషయాన్ని వారు సత్తిబాబుకు తెలియజేయడంతో అతడు వచ్చి అన్న శ్రీనివాస్‌ను నెట్టేయడంతో అన్నకు గాయాలైనట్లు సమాచారం. ఈ సంఘటనపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని మృతి


రాంరెడ్డి (ఫైల్)

కేతేపల్లి: విజయవాడ–హైదరాబాద జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుపాముల గ్రామానికి చెందిన పాశం రాంరెడ్డి(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి రాంరెడ్డి ఇనుపాముల శివారులో నకిరేకల్ వైజంక్షన్ వద్ద హైవేను కాలినడకన దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టవేరా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంరెడ్డి కాళ్లు, చేతులు విరగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. రాంరెడ్డిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు రాంరెడ్డి అవివాహితుడు. మృతుడి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ యు. సతీష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..


వెంకట్‌రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ శివారులో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన వరి కోత మిషన్ మెకానిక్‌లు బైక్‌పై నార్కట్‌పల్లి వైపు వస్తుండగా.. మార్గమధ్యలో చెర్వుగట్టు గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన మేక వెంకట్‌రెడ్డి(56) బైక్‌పై రోడ్డు దాటుతుండగా.. అతడిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వెంకట్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కల్లు గీత కార్మికుల సంక్షేమానికి పోరాడుతాం


కరపత్రాలను విడుదల చేస్తున్న సభ్యులు

చిట్యాల: గౌడ వృత్తిదారుల సంక్షేమానికి కల్లు గీత కార్మిక సంఘం 1957 నుంచి పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనగుళ్ల అచ్చాలు అన్నారు. చిట్యాల మండలం తాళ్ళవెల్లెంల గ్రామంలో ఆదివారం జరిగిన ఆ సంఘం 68వ వార్షికోత్సవంలో అచ్చాలు పాల్గొని జెండా ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఈ నెల 25వ తేదీన చిట్యాలలో నిర్వహించనున్న కల్లు గీత కార్మిక సంఘం మహాసభల ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో నకిరేకంటి రాములు, గునగంటి నర్సింహ, నకిరేకంటి అంజయ్య, బత్తుల స్వామి, పామనుగుళ్ల బుచ్చిరాములు, జనగాం వెంకటయ్య పాల్గొన్నారు.

ఇ-పంచాయతీ ఆపరేటర్‌ను ఏర్పాటు చేయరూ..


గట్టుప్పల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం

గట్టుప్పల్ : మండల పరిషత్‌కు.. గ్రామ పంచాయతీలకు కీలకమైన ఇ-పంచాయతీ పోస్టు సుమారు 10 నెలలుగా ఖాళీగా ఉండడంతో మండల ప్రజలు, పంచాయతీ కార్యదర్శులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గట్టుప్పల్ నూతన మండలంగా రెండేళ్ల క్రితం ఏర్పాటు కాగా.. మండల పరిషత్‌కు గెజిట్ విడుదల చేసి 10 నెలలు కావొస్తోంది. ఇ-పంచాయతీ ఆపరేటర్‌ను ఇటీవల చండూరు మండలం నుంచి డిప్యుటేషన్ ఇస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ ఆపరేటర్ ఒకటి రెండు రోజులు విధులు నిర్వర్తించి తిరిగి పాత మండలాని వెళ్లాడు. దీంతో ఇక్కడ ఆ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది. ఆపరేటర్ నిర్వహించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల బదిలీ, ఇంటి పన్నులు, నూతన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారం, గ్రామ పంచాయతీల లావాదేవీలు, ఇతర పనులు పెండింగ్ పడుతూ వస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీఓ వసంతలక్ష్మిని వివరణ కోరగా.. ప్రస్తుతం పనులు పెండింగ్‌లో లేకుండా కార్యాలయ సిబ్బంది ద్వారా చేయిస్తున్నామని తెలిపారు. ఆపరేటర్ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

మండల స్వామికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కవులు

రామగిరి(నల్లగొండ): ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు డాక్టర్ మండల స్వామి మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలో డాక్టర్ మండల స్వామి ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా డాక్టర్ మండల స్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ పగడాల నాగేందర్, సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ళ ఆనంద్, సాహితీవేత్తలు మునాసు వెంకట్, చిలివేరు లింగమూర్తి, పి వెంకులు, తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం


జర్నలిస్టులతో కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్

చిట్యాల: సమాజంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో జర్నలిస్టుల పాత్ర కీలకమని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ అన్నారు. దీపావళి పండగ సందర్భంగా చిట్యాలలో ఆదివారం జర్నలిస్టులకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిట్యాల మండలంలోని ప్రింట్ అండ్ డిజిటల్ మీడియా జర్నలిస్టులను శాలువలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవ చేస్తున్న జర్నలిస్టులకు గుర్తింపుగానే ఈ కార్యక్రమాన్ని ప్రతియేటా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాత్విక, క్లింకార, సీనియర్ జర్నలిస్టులు పాటి మాధవరెడ్డి, మూడ వేణు, మెండె వెంకన్నయాదవ్, రెగొండ వేణుమాధవ్, మూడ వెంకటాద్రి, చెన్నోజు చంద్రశేఖర్, గుండ్లపల్లి వెంకన్న, పోకల కరుణాకర్, చికిలంమెట్ల మోహర్‌బాబు, చెరుపల్లి శ్రీనివాస్, కూనూరు మధుగౌడ్, పాల రాకేష్, సాయి పాల్గొన్నారు.

కొనుగోళ్లు ఆలస్యం.. అన్నదాత ఆగమాగం


వర్షానికి తడిసిన ధాన్యం రాశులు


తడిసిన ధాన్యాన్ని కుప్పపోస్తున్న రైతులు

రామగిరి(నల్లగొండ): కొనుగోళ్లు ఆలస్యం కావడంతో ధాన్యం విక్రయించుకోవాలని అనుకున్న రైతుల ఆశలు అడియాశలు అవుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నల్లగొండ పట్టణంలోని ఎస్ఎల్‌బీసీలో గల ఎన్‌డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలోని రైతుల ధాన్యం రాశులు తడిసిపోయాయి. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోవడంతోనే కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడిసిందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన రాపర్తి నాగలక్ష్మి కుటుంబానికి శ్రీరేణుకా ఎల్లమ్మ జమదగ్ని సమేత చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం రూ.1.04 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నాగలక్ష్మి ఇటీవల అయిటిపాముల గ్రామంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. చికిత్స కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఇప్పటికే రూ.15 లక్షలు ఖర్చయ్యాయి. విషయం తెలుసుకున్న కట్టంగూర్‌కు చెందిన శ్రీరేణుకా ఎల్లమ్మ జమదగ్ని ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బుడిగ అనూష, సభ్యులు తేల్ల మల్లయ్య, కావటి మధు, కానుగు విజయ, బొబ్బలి జానయ్య, కడారి శ్రీను, అన్వేష్, ఐతగోని సైదులు, వీరయ్య, నాగమణి, శైలజ, మహేష్, కంచర్ల విజయ, కార్తీక, వెంకన్న పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ


పేపర్‌పై వేసిన చిత్రాన్ని చూస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పంప్‌కిన్ పాచ్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ విద్యార్థులు చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచారు. జాన్సన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నేషనల్ టాలెంట్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పంప్‌కిన్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వడ్లకొండ అన్విక, 9వ తరగతికి చెందిన జోహా రుమైసా ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. నిమిషాల్లోనే మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చిత్రాన్ని పేపర్‌పై పెన్సిల్‌తో వేసి అబ్బురపరిచారు. వారిని వెంకయ్యనాయుడు అభినందించి అవార్డులు అందజేశారు. విద్యార్థులను డ్రాయింగ్ టీచర్ రాజ్‌కుమార్, పాఠశాల చైర్మన్ హుురీన్ అభినందించారు. అవార్డు పొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, సహచర విద్యార్థులు అభినందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలోని నర్సింగ్‌భట్ల గ్రామంలో నల్లగొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా వలంటీర్లు నర్సింగ్‌భట్ల, చెన్నుగూడెం, పాతూరులో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మద్యపాన నిషేధం, గంజాయి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జాకీరాతాజుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.అనిత, ఎం.గోవర్ధన్, ఏ.రాణి, స్థానిక ప్రజాప్రతినిధులు కె.లింగస్వామి, బి.ప్రవీణ్. డా.సీహెచ్.భిక్షపతి, రజిత, టి.స్వామి, అధ్యాపకులు యన్నమళ్ళ నాగరాజు, డా.బొజ్జ కిరణ్‌కుమార్, గణేశ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


చెత్తాచెదారం తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఉద్యమస్ఫూర్తిని బీసీలు కొనసాగించాలి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: బీసీలు ఇదే ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. ఆదివారం నల్లగొండలోని విద్యార్థి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బంద్‌ను విజయవంతం చేసిన ఉమ్మడి జిల్లా ప్రజలకు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు, స్వచ్ఛందంగా బంద్ చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, కర్నాటి యాదగిరి, అనంతు నాగరాజుగౌడ్, రవికుమార్‌యాదవ్, కన్నబోయిన రాజుయాదవ్, ముత్తినేని శ్రీకాంత్ వర్మ, కారింగ్ మహేందర్, పరశురాములు, పరమేష్, విజయ్, నరసింహాచారి పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మిర్యాలగూడ: పట్టణంలోని నవజ్యోతి పాఠశాలలో ఆదివారం జన వి/్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిట్స్, పక్షవాతం, బీపీ, షుగర్ రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన 270 మంది రోగులకు ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ వైద్యపరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులను దాత కోల ప్రకృత్ దివ్యశ్రీ అందజేశారు. పాదూరి రమణారెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణమూర్తి, ప్రశాంతి, వేదశ్రీ, శోభ, నసీమా, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.